
# సారే జహాఁసే అచ్ఛా



టెలిగ్రాం వచ్చిందనగానే ఎవరి దగ్గరనుంచి ఏమి వార్త వచ్చిందోనని కంగారుగా బయటకు వచ్చా. మా అబ్బాయి సంతకం పెట్టి టెలిగ్రాం చదువుతున్నాడు. మా ఆవిడ, మా అమ్మాయి కంగారుగా 'ఎక్కడి నుంచి టెలిగ్రాం' అంటూ బయటకు వచ్చారు.

"శాస్త్రి మామయ్య నుంచి-సలీం చనిపోయాడట."

నాకొక్కసారిగా షాకు తగిలినట్లయింది, "సలీమా!"

"అవును, నిన్ను వెంటనే రమ్మని."

"అదేమిటండీ, సలీం-గట్టిగా పాతికేళ్ళుండవు. ఎలా పోయాడు?" మా ఆవిడ అర్థంలేని ప్రశ్న.

"టెలిగ్రాంలో అవన్నీ ఎలా వుంటాయమ్మా" మా అబ్బాయి విసుగు.

నేను టైం చూసుకున్నా, పదయింది. కర్ఫ్యూ వల్ల హైద్రాబాద్‌కి బస్సులు కూడా రద్దు చేశారు. ఏదో ఒక రైలు దొరకక పోతుందాని స్టేషనుకి బయల్దేరా.

"నేనూ రానా" అంది మా ఆవిడ.

"వద్దు, హైద్రాబాద్‌లో అసలే గొడవలుగా వున్నాయి. కర్ఫ్యూ కూడా. నేనైతే ఎలాగోలా వెళ్తా."

"జాగ్రత్త, రైల్లో, రిక్షాల్లో! ఎక్కువ మాట్లాడకండి. ఎవరెక్కడ గొడవ పెట్టుకుంటారో తెలియటంలా."

"ఫర్వాలేదులే," అని ధైర్యం చెప్పాను.

స్టేషను కొచ్చేసరికి 'గౌతమి' రెడీగా వుంది. రైలులో రద్దీ లేదు. టి.టి.నడిగి స్లీపర్ కోచ్ ఎక్కా.

రైలు ముందుకు వెళ్తోంది. నిద్ర రావటం లేదు. నా ఆలోచనలు వెనక్కి వెళ్తున్నాయి.

* * *

కాకినాడలో ఇంజనీరింగ్ చదివే రోజులవి. అమ్మ, నాన్న హాస్టల్‌లో వుండమన్నా కలర్ కోసం, డేస్కాలర్‌గానే వున్నా. మా ఫ్రెండ్స్ సర్కిల్ తమాషాగా వుండేది. భావి భారత పౌరులు స్కూళ్ళలో, కాలేజీల్లోనే తయారవుతారు.

గోపాల్ ఒక తీవ్రవాది.

రజనీకి స్మగ్లింగ్ అంటే సరదా.

శాస్త్రి ఒక ఛాందసుడు.

నిజం చెప్పాలంటే నాకు ఏ భావాలూ లేవు. ఈ ముగ్గురిలో ఎవరు మాట్లాడుతున్నా, ఆ వాదం నాకు నచ్చేది. స్వంత వ్యక్తిత్వం లేనివాడిని. ఐతే నల్గురికీ కామన్ సబ్జెక్ట్ 'కలర్'.

కాలేజీ మాని, బస్సు స్టాండులు, ఉమన్స్ కాలేజీ, ఉమన్స్ పాలిటెక్నిక్-సాయంకాలాలు సినిమా హాల్స్ దగ్గర వేళ్ళాడే వాళ్ళం. మమ్మల్ని కాలేజీలో 'కలర్ గ్యాంగ్' అనే వాళ్ళు.

బి.ఇ. మూడవ సంవత్సరం. ఒక రోజు మామూలుగానే కాలేజి మాని, కలర్ వేటకి బయల్దేరాం.

"స్టేషన్ కెళ్దాంరా" అన్నాడు రజని.

"స్టేషను కెందుకురా యిప్పుడు, బస్సు దగ్గర కలరంతా మిస్సవుతాం" అన్నాన్నేను.

"ఛరే ఛేంజ్...సర్కార్ ఎక్స్‌ప్రెస్ టైం. మంచి అమ్మాయిలుంటే చూసి వద్దాం" అన్నాడు రజని.

"సరే"నన్నాం.

స్టేషను రద్దీగా వుంది.

"మంచి కలర్‌ఫుల్‌గా వుందిరా" మా గోపాల్‌లో హుషారొచ్చింది.

"అక్కడ చూడరా, ఆ పాప బాగుంది" అన్నాడు రజని. అటు చూశాం, ఆ అమ్మాయి చాలా బాగుంది.

వెళ్ళి ముద్దు పెట్టుకునేంత స్పీడుగా, శాస్త్రి ఆ అమ్మాయి వాళ్ళూ వున్న వైపు వెళ్ళాడు.

ఆ స్పీడులో ప్లాటుఫాం మీద స్తంభానికి కొట్టుకున్నాడు.

ఆ అమ్మాయి కిసుక్కున నవ్వింది.

"ఇలాంటి సంఘటనలేరా ప్రేమకి దారి తీసేది" అన్నాన్నేను.

"తల పగిలి వాడేడుస్తుంటే, ప్రేమ కబుర్లు చెప్తావేరా" కోప్పడ్డాడు గోపాల్.

ఆ అమ్మాయి అటు తిరిగి నవ్వుతూ వాళ్ళ తమ్ముడితో ఏదో చెబ్తోంది. ఆ అమ్మాయి ఓరకంటితో మమ్మల్ని చూస్తూ, మా మాటలు వింటోందని గ్రహించాను.

రైలు వచ్చింది. అందరూ బిలబిలా ఎక్కారు.

ఆ అమ్మాయి వాళ్ళు ఎదురుగా కంపార్ట్‌మెంట్‌లో ఎక్కారు. ఆ అమ్మాయి కిటికీ దగ్గరగా కూర్చుంది.

"చూశావ్రా, ఆ అమ్మాయి మనల్నే చూస్తోంది" అన్నాడు గోపాల్.

"నీ బొంద, ప్రపంచంలో అమ్మాయిలందరూ



# ఈ ప్రశ్నకు ఏ మాత్రం జవాబిస్తుంది

నీ కోసమే పుట్టారనుకుంటావ్'' కసురుకున్నాడు రజని.

శాస్త్రి అంత బాధలోనూ ఆ అమ్మాయి అందాన్ని కళ్ళతో జుర్రుకుంటున్నాడు.

''ఏ వూరమ్మాయో, మనసు పారేసుకోకు'' అన్నానేను.

రైలు కదిలింది. వచ్చినప్పటి ఉత్సాహం లేదు. ఆ అమ్మాయి వాళ్ళ తమ్ముడికేదో చూపిస్తూ, మమ్మల్నే చూస్తోంది. 'నెరజాణే' అనుకున్నా.

''తల పగిలిపోయిందిరా'' అన్నాడు శాస్త్రి స్టేషను నుంచి బయటకు వస్తూనే!

''ఏ నాయనా, ఆ అమ్మాయిని చూస్తున్నంత సేపు బాధ తెలియలేదా'' చురకంటించాడు. రజని.

''పోన్లేరా, ఆ అమ్మాయి నిన్ను ప్రేమిస్తుం దేమో'' మా గోపాలం ఆశాజీవి.

''ఆలూ లేదు, చూలూలేదు, కొడుకు పేరు సోమలింగం అన్నట్టు ఆ అమ్మాయి ఎవరో తెలియదు, అప్పుడే ప్రేమ, పెళ్ళి వరకూ వెళ్ళిపోయావా'' అన్నాడు రజని.

''మంచి కాఫీ తాగుదాం రండిరా'' అని ఎదురుగా హోటల్లోకి దారితీశా. శాస్త్రి కళ్ళలో నాకు మార్పు కనిపించింది.

మూడు వారాల తర్వాత కాలేజీ నుంచి తిరిగి వస్తుంటే, మా ముందు నలుగురమ్మాయిలు నడుస్తున్నారు. కొద్దిగా స్పీడు పెంచాం, ఓవర్ టేక్ చేయటానికి.

ఆశ్చర్యం, ఆ రోజు అమ్మాయి కూడా వుంది.

''రేయ్ పాపరా'' శాస్త్రి అరచినంత బిగ్గరగా మాట్లాడాడు.

ఆ అమ్మాయిలు మమ్మల్ని చూసి నవ్వుకుంటూ వెళ్తున్నారు. ఆ అమ్మాయి మమ్మల్ని గుర్తుపట్టి నట్టుంది.

మేము వుండే గదికి మూడు సందుల ముందుగా ఆ అమ్మాయి ఒక యింటిలోకి వెళ్ళింది.

''రేయ్, ఈ వూరమ్మాయేరా'' శాస్త్రి ఆనందం.

''వీడి గోలేమిటిరా, తల పగలకొట్టుకుని, త్యాగం చేశాడని ఆ అమ్మాయి వీడ్ని ప్రేమించేస్తుందనుకుంటాడా ఏంటిరా'' అన్నాడు రజని.

''రవీ, ఎవర్రా ఆ అమ్మాయి, మనం ఎప్పుడూ చూడలేదు'' శాస్త్రి.

''నాకేం తెలుసురా, ఇప్పుడేగా నేనూ చూస్తున్నా'' అన్నానేను.

''రేపు ఈ అమ్మాయి ఎవరో, ఏమిటో తెలుసుకోవాలిరా'' శాస్త్రి ఉత్సాహం.

''తెల్సుకుని, పెళ్ళి చేసుకుంటావా? సక్రమంగా చేస్తేనే, ఇంకా బి.ఇ. రెండేళ్ళుంది. మీ అమ్మ, నాన్న కాళ్ళిరక్కొడతారు'' రజని ఏదో కసిగా అన్నాడు.

''ఎందుకురా వాడి ఉత్సాహాన్ని నీళ్ళు కారుస్తావ్'' అని కోప్పడ్డా నేను.

''రవీ, ఆ అమ్మాయి పేరు వివరాలు రేపు తెలుసుకోవాలిరా ''పడుకునే ముందు నెమ్మదిగా నా దగ్గర చేరి శాస్త్రి అభ్యర్థించాడు.

''ఏమిటిరా, లవ్ ఎట్ ఫస్ట్ సైట్‌లా... సర్లే పడుకో, రేపు చూద్దాం '' అన్నా నేను.

మర్నాడు ఎనిమిది గంటలకల్లా నేను, శాస్త్రి భానుగుడి బస్టాండు దగ్గర చేరాం. కాళ్ళు నెప్పెడుతున్నాయి, ఆ అమ్మాయి ఇంకా రాదు. బస్సులన్నీ వెళ్ళిపోతున్నాయి.

''ఇంకా పోదాంరా'' అన్నానేను.

''కాస్సేపురా, ఐస్ క్రీం యిప్పిస్తా, సినిమాకి తీసుకెళ్తా'' నాకు నవ్వొచ్చింది. ఆ రెంటికీ నేనే ఫైనాన్స్ చేయాలి.

''ఆ వస్తోందిరా. రేయ్, నాకు వణుకుగా వుంది. నువ్వే ఎలాగోలా టాకిల్ చేయి'' అన్నాడు శాస్త్రి.

ఆ అమ్మాయి ఒకతే వచ్చింది. చేతిలో పుస్తకాలున్నాయి అంటే ఏదో కాలేజీలో చదువుతోందన్న మాట.

దూరంగా బుద్ధిమంతుల్లా నిలబడ్డాం. కానీ ఆ అమ్మాయి మమ్మల్ని గమనిస్తున్నట్టు నేను గ్రహించా.

నెంబర్ టు బస్సు వచ్చింది. బస్సు రద్దీగా వుంది. ఆ అమ్మాయి బస్సెక్కింది. మేమూ ఎక్కాం. లేడీస్ సీట్లలో ఖాళీ వుంటే ఆ అమ్మాయి కూర్చుంది. నేను పక్కగా వెళ్ళి నిలబడ్డా.

పుస్తకం మీద ఆ అమ్మాయి పేరుంది, చదువుదామని ప్రయత్నించా. ఆ అమ్మాయి పుస్తకంలో పేజీలు విప్పింది. అంటే నన్ను ఓ కంట చూస్తోందన్నమాట.

కాసేపయింతర్వాత పేరు నాకు కనపడాలన్నట్టుగా పుస్తకాలు పట్టుకుంది.

''సయీదా బేగం''

నాకు ఓ పట్టాన నోరు తిరగలేదు.

ఆ అమ్మాయి దిగుతూ నా వంక పలకరింపుగా నవ్వింది.

''పేరేమిటిరా, చూశావా'' బస్సు దిగుతూనే ప్రశ్న వేశాడు శాస్త్రి.

''ఆ బాలా త్రిపురసుందరి''

''ఛ అదేం పేరురా?''

''నన్నేం చేయమంటావ్, నన్నడిగి పెట్టారా పేరు?''

''కోప్పడకురా. అంత చక్కటి పాపకి అదేం పేరురా, రాజశ్రీ, వాణిశ్రీలా కాకుండా ''వాడికి పేరుతోనే సగం దిగిపోయింది. ఇంక నేను చెప్పేది వింటే షాకు నుంచి తట్టుకుంటాడా?

''ఆ అమ్మాయి పేరు సయీదా బేగం, ముస్లిమ్స్ అన్నమాట'' టీ త్రాగుతూ అన్నా.

''బాలా త్రిపుర సుందరి అన్నావు గదరా!''

''నిన్నేడిపించటానికన్నా''

''సయీదా బేగం...బాగుందిరా పేరు''

''నీ బొంద, ముస్లింల పేర్లు ఒక్కటి తెలియవు. బాగుందేంటి?''

''అందుకేరా, వహీదా రహమాన్ వాళ్ళలా.. కాని...''

''కానీ...''

"అంత చక్కటి అమ్మాయి ముస్లిం అయిపోయిందిరా"

"ముస్లిం అయితే యేం, ప్రేమించి పెళ్ళి చేసుకోటాన్కి?" శాస్త్రి ఆలోచనలో పడ్డాడు.

సాయంత్రం మైసూరు కేఫ్‌లో కాఫీ త్రాగుతున్నాం. వాతావరణం సీరియస్‌గా వుంది. నల్గురం మాట్లాడటం లేదు.

"రవీ, ఎలాగోలా రేపు నువ్వా అమ్మాయితో మాట్లాడాలిరా" అన్నాడు శాస్త్రి.

"ఏమిటిరా, ఆ అమ్మాయిని నువ్వు ప్రేమిస్తున్నావా, నన్ను ప్రేమించమంటావా" విసుక్కున్నా నేను వాడి ధోరణికి.

"నువ్వు ప్రేమించు, వాడు పెళ్ళి చేసుకుంటాడు" చచ్చు జోకు వేశాడు రజని.

"అది కాదురా, నువ్వు ప్రేమిస్తే, నువ్వే ప్రొసీడ్ అవ్వు" గోపాలంది ఎప్పుడూ పెద్దమనిషి తరహా.

ఆ మరునాడు అనుకోకుండా ఛాన్సు కలిసొచ్చింది. తుఫాను నిధి కోసం విరాళాలు సేకరించాలని విద్యార్థి లోకం నిర్ణయించింది. అందరం తలో డబ్బా పట్టుకు బయల్దేరాం.

ఆ అమ్మాయి బస్టాండులో నిలబడింది. శాస్త్రికి సైగ చేశా, ప్రొసీడ్ అవమని.

"భయం వేస్తోందిరా" అన్నాడు.

"భయపడ్తే, అమ్మాయి నెలా ప్రేమిస్తావురా" రజని గిల్లాడు.

శాస్త్రి ధైర్యం చేసుకుని నెమ్మదిగా ఆ అమ్మాయి దగ్గరకు వెళ్ళాడు.

"సయీదా బేగం గారూ, డబ్బాలో ఏదైనా వేయరా"

తర్వాత అంత అసహ్యంగా మాట్లాడినందుకు ఓ వారం రోజులు మేము ముగ్గురం వాడ్ని చితక బాదాం మాటలతో.

"మీరదుక్కునే వాళ్ళాండి" చురకంటించిందా అమ్మాయి.

"ఆ, ఆ, లేదు, తుపాను నిధికి."

డబ్బాలో పది రూపాయిల నోటు వేసి "నా పేరెలా తెల్సు మీకు?" అంది ఆ అమ్మాయి.

"మా వాడు చెప్పాడు" అని నన్ను చూపించాడు.

"ఆయనకి కంగ్రాట్స్ చెప్పండి...నా పేరు కనుక్కోగల్గినందుకు" దూరంగా నున్న నా వంక మెచ్చుకోలుగా చూస్తూ అంది ఆ అమ్మాయి.

"అలాగే" అంటూ మా వాడు వచ్చేశాడు.

"ఇదేదో ట్రయాంగులర్ లవ్‌లా వుందిరా, వీడు ఆ అమ్మాయిని ప్రేమిస్తున్నాడు, ఆ అమ్మాయి రవిని ప్రేమిస్తోంది. ఈ రవి త్యాగ పురుషుడిలా యిద్దరినీ కలపటాన్కి ప్రయత్నిస్తున్నాడు" రజని విజృంభిస్తున్నాడు.

"నీకు బుద్ధుండాలిరా! ఆ క్రెడిట్ నువ్వు తీసుకోక, నన్ను చూపించటమేమిటిరా?" విసుక్కున్నా నేను.

ఆ రాత్రి శాస్త్రి సరిగా నిద్రపోలా" ఏమిటిరా ఈ పిచ్చి ఎవరో...ఏమిటో...అదీగాక ముస్లిమ్స్... ఎలాగనుకున్నావురా...మనం యిప్పటి వరకు ఏదో 'కలర్' చూసి ఎంజాయ్ చేస్తున్నాం...చదువులు పూర్తి చేయకుండా, యిలాంటి వ్యవహారాల్లో దిగటాన్కి మనమేమైనా వెండి చెంచా నోట్లో పెట్టుకు పుట్టామా? ఏదో మన చదువు మనం చదువుకోవాలి గానీ..." చీవాట్లేశా.

"లేదురా, అందరినీ చూసినట్లు ఆ అమ్మాయి అనిపించటం లేదురా, ఏదో ఆకర్షణ...పిచ్చిగా వుంది...ఎలాగోలా దారి చూపరా"

మర్నాడు బస్టాండులో కాపలా కాశాం. ఆ అమ్మాయిని నేనే పలకరించా, "థ్యాంక్సండీ"

ఎందుకన్నట్లు చూసింది.

"నిన్న మీరు మా వాడితో నాకు కంగ్రాట్స్ చెప్పారటగా!"

"ఇంకో అమ్మాయి పుస్తకాల్లోకి తొంగి చూసి, పేరు తెలుసుకోటం తప్పనిపించలేదా మీకు?"

"అలా కోప్పడవద్దు. మా వాడు మీ పేరేమిటో అనుకుంటే చూసి చెప్పా, క్షమించండి."

టి.ఎస్. హరగోపాల్ బి.ఇ.
అనుపమా అపార్ట్‌మెంట్స్
*OPP లయోలా కాలేజి, విజయవాడ-8*

"ఛ ఛ అదేం లేదు...మీ ఫ్రెండ్ తల బొప్పి తగ్గిందా?" గల గలా నవ్వింది. సెలయేరు చూడలేదు గానీ, శబ్దం యిలాగే వుంటుందేమో.

"మిమ్మల్ని చూసేసరికి ఆ ఆనందంలో తల పగలగొట్టుకున్నాడు.

"తలే పగల గొట్టుకుంటాడో, ప్రాణాలే తీసుకుంటాడో మీ ఫ్రెండ్ జాగ్రత్త" అంది.

"నా పేరు రవి, మా వాడి పేరు శాస్త్రి...అనిల్ శాస్త్రి."

"మీరు చాలా ముందుకెళ్ళిపోతున్నారు" ఆ అమ్మాయి మళ్ళీ నవ్వింది.

ఆ అమ్మాయి మాకు వార్నింగ్ యిస్తోందో, గ్రీన్ సిగ్నల్ యిస్తోందో అర్థం అవడం లేదు.

ఐతే తెగించందే ఫలితం లేదని, నేనే ప్రొసీడ్ అయ్యా.

"ఏం చదువుతున్నారు?"

"మీరు?"

"మేం బి.ఇ. మూడవ సంవత్సరం."

"కాలేజీలు ప్రొద్దున వుండవా", దవడ పగిలేటట్లు అడిగింది.

"ఆ, ఆ, వుంటాయి. ఇంపార్టెంట్ కాదు...మధ్యాహ్నం నుంచి వెళ్తాం..." శాస్త్రి తడబడుతూ సమాధానం చెప్పాడు.

"మీరు..." నేను నసిగాను.

"బి.ఎ. ఫస్టియర్."

"అంటే యిద్దరికీ డిగ్రీ ఒకసారే అయిపోతుందిరా" మా వాడు నాతో నెమ్మదిగా అంటున్నాడు.

"మీ ఫ్రెండ్ ఏదో అంటున్నారు?"

"వాడు...పగటి కలలు కంటున్నాడు"

"జాగ్రత్త యిది మెయిన్ రోడ్డు"

బస్సు వచ్చింది. ఆ అమ్మాయి బస్సెక్కింది. మేము ఆ సెంటరులో టీ త్రాగి, కాలేజీకి వెళ్ళాం.

ఆ తర్వాత నేను పక్కకి తప్పుకున్నా. మా శాస్త్రి చాలా స్పీడుగా ప్రొసీడ్ అయ్యాడు. ఆ యిద్దరూ ఒకరి కోసం ఒకరు బ్రతుకుతున్నంతగా, ఒకరి కోసం ఒకరు పుట్టినట్టుగా, జన్మ జన్మ బంధాలా అన్నంతగా ప్రేమలో పడ్డారు.

రెండేళ్ళు గడిచిపోయాయి. ఇప్పటి వరకు ప్రేమే గానీ, పెళ్ళిమాట యిద్దరూ ఎత్తలేదు. మేం ముగ్గురం కూడా ఆ విషయం ఆలోచించలా.

ఒక రోజు అయిదుగురం సినిమాకి వెళ్ళాం. సయీదా శాస్త్రికీ, నాకూ మధ్య కూర్చుంది.

సడెన్‌గా "అన్నయ్యా మా పెళ్ళి ఎలా" అంది.

నేను షాక్ తిన్నా. నన్ను 'రవీ' అని పిలవటమే సయీదా అలవాటు. ఆ పిలుపు కొత్తగా వుంది. శరీరంలో ఏదో మార్పు. చెల్లాయి వుంటే, ఎలాగుంటుందో నాకు తెలియదు. నాకందరూ అక్కయ్యలే. చెల్లాయి బాధ్యత ఎలా వహించాలో నాకు తెలియదు.

"మాట్లాడవేం అన్నయ్యా!"

"ఏం మాట్లాడనమ్మా..." నా గొంతు నాకే వింతగా వుంది.

"మొదటి నుంచి మమ్మల్ని దగ్గరకు చేర్చింది నువ్వే" బాధ్యత నీదేనన్న భావం సయీదా మాటల్లో స్ఫురించింది.

"ఏమిటి, కబుర్లు చెప్పేసుకుంటున్నారు" రజని ఉడుక్కున్నాడు.

"ఏం లేదులే" అని తేల్చేశా.

వాళ్ళింటి సందు దగ్గరకు వచ్చేసరికి ఒక అడుగు వెనక్కి వేసి, నా కొక్కడికే వినపడేటట్లుగా "నే చెప్పిన సంగతి ఆలోచించు అన్నయ్యా" అంది సయీదా.

ఆ క్షణాన నా కళ్ళలో నీళ్ళుబికి వచ్చాయి, ఆ అమ్మాయి నా మీద చూపిన నమ్మకానికి, ప్రేమకు.

ఆ రాత్రి గోపాల్, రజని పడుకున్న తర్వాత శాస్త్రిని తీసుకుని బయటికి వచ్చా.

"ఎలారా?" అన్నాడు శాస్త్రి.

నాకు చాలా కోపం వచ్చింది "ఎలారా ఏమిటి? ప్రేమించినప్పుడు, పెళ్ళిచేసుకోటం ఎలా ఏమిటి?"

"సయీదా ముస్లిం పిల్ల, మేం బ్రాహ్మణులం."

"ఐతే...? ఆ జ్ఞానం ముందు లేదా? ఇప్పుడా పిల్ల నిన్ను ప్రేమించి, నీ మీద ఆశలు పెంచుకుంటే పెళ్ళికి కాదంటావా?"

"కాదని నేననలేదు. అటు పెద్దలూ యిటు పెద్దలూ..." నసిగాడు.

"ప్రేమించినప్పుడు పెద్దలతో సంబంధం లేదు. పెళ్ళి చేసుకోటానికి పెద్దలు కావాలా?"

"అలా అనటంలా. సయీదాని పెళ్ళి చేసుకోటం నా కిష్టమే. ఐతే పెద్దల సమస్యని పరిష్కరించాలి."

మరునాడు నాలో ఏదో తెగింపు వచ్చింది.

"ముస్లింల యింటికి వెళ్ళి ఓ బ్రాహ్మణుల కుర్రాడికి వాళ్ళమ్మాయి నివ్వమంటే, ఊరుకుంటారా?

నేను ప్రాణాలతో తిరిగి వస్తావా? లేనిపోని సాహసం చేస్తున్నానేమో! సరే...ఏదయితే అదవుతుంది'' మొండి ధైర్యంగా వెళ్ళా.

కాలింగ్ బెల్ కొట్టా. సయిూదా వాళ్ళ నాన్నగారు తలుపు తీశారు. ఆయన రిటైర్డ్ హెడ్మాష్టరు. ''ఎవరూ'' అన్నారు.

''మీతో పనుండి వచ్చా''

''రండి...మీరెవరో...''

''నా పేరు రవి. బి.ఇ. ఫైనలియర్.''

''సంతోషం. నాతో ఏం పని బాబూ?''

తలుపు చాటు నుంచి సయిూదా చూస్తోంది, ఏం చెబుతానా అని.

నాలో ఆ తెగింపు ఎలా వచ్చిందో యిప్పటికీ తెలియదు, సయిూదా 'అన్నయ్యా' అని పిలిచేపిలుపు లోని మాధుర్యమా...ఏమో!

''పెద్దవారు తప్పయితే క్షమించండి...మీ అమ్మాయి సయిూదా వివాహ విషయమై మాట్లాడుదామని వచ్చా''

అరవై నిండిన ఆ అనుభవజ్ఞునికి కూడా ఆశ్చర్యం వేసింది. ''మా అమ్మాయి సయిూదాకా?''

''సయిూదా నా చెల్లెలి వంటిది. ఒక అన్నలా ఆ అమ్మాయి పెళ్ళి బాధ్యత నా మీద వేసుకొని వచ్చా'' నాలో పరిస్థితుల కనుగుణంగా మాట మార్చే శక్తి కాలేజీ రోజుల్లోనే అలవాటు పడింది.

''మా అమ్మాయి మీకెలా తెలుసు? మా అమ్మాయి పెళ్ళి విషయం మీకెందుకు?''

''ఒకే పట్టణంలో చదువుకొనే కాలేజీ పిల్లలు ఒకరి కొకరు తెలియకుండా ఎలా వుంటారు?'' చాలా అసందర్భమైన మాటల్ని సందర్భోచితంగా వాడా.

''నా ఫ్రెండ్ అనిల్ శాస్త్రి అని అతను కూడా నాతోనే బి.ఇ. ఫైనలియర్. బుద్ధిమంతుడు. అతను మీ అమ్మాయిని వివాహం చేసుకుందామనుకుంటు న్నాడు. వాళ్ళిద్దరూ ప్రేమించుకున్నారు...పెద్దల ఆశీర్వచనం కావాలంతే' ఆయన్ని గుక్క తిప్పకో నివ్వలా

'''హిందువులా?'' చివరకు ఆయన నోటంట మాట పెగిలింది.

''అవును, వాళ్ళ నాన్నగారు గుంటూరులో డాక్టరు. ఇతనొక్కడే కొడుకు.''

''నాయనా, నేను గాంధేయవాదిని. కాబట్టి మతాంతర వివాహం నాకభ్యంతరం లేదు. కాని, వాళ్ళ వాళ్ళు ఒప్పుకోవద్దూ...సయిదా-అమ్మాయి సయిూదా-ఏమ్మా, కాలేజీకి వెళ్ళి నువ్వు చేసిందిదా? మాట వరసకి నాతో చెప్పలేదే! బాబూ రవీ, అమ్మాయి కిష్టమైతే యితర యిబ్బందులు లేకుంటే, నాకేమీ అభ్యంతరం లేదు.''

నా విజయానికి నన్ను నేనే అభినందించుకున్నాను. గుంటూరు వెళ్ళి శాస్త్రి అమ్మగార్ని, నాన్నగార్ని ఒప్పించా వేసవిలో శాస్త్రిని, సయిూదాని ఒకయింటి వాళ్ళని చేశా. సయిూదా నా కెప్పుడూ కృతజ్ఞతలు చెబుతూనే వుంటుంది.

# నెత్తుటి దృశ్యం



మళ్ళీ
నా మిత్రుడు మోసపోయాడు
నెత్తురోడుతున్న రోడ్లపై
విషాదమై ప్రవహిస్తున్నాడు
అమ్మ స్తన్యమై తెగిపడుతున్నాడు
క్రనెప్పులపై మృత్యువై వాలి పోతున్నాడు

అజ్ఞాత పసిహృదయపు బాల్యం
కన్నీరై వొలికి పోతున్నది
లేతకళ్ళ భవితవ్యం
చీకటి దారుల్లో చిక్కుబడి పోతున్నది
దేవర కొలువుల్లో
దేశాన్ని బలిపెడుతున్న దృశ్యం
ప్రతి చీకటి రాత్రిలో
మారిపోతున్న సన్నివేశం
ష్... ని''శ్శబ్దం''
రోడ్లపై గురితప్పిన తుపాకీల గస్తీ
పెదవి దాటి రాకు
పిట్టవైపోతావు
రెప్పలు వాల్చే రాత్రుల్ని
తెల్లారనీయకు
అరచేత బిగబట్టిన హృదయాల్ని
తన్నుకు పోతాయి

ఈ జనారణ్యంలో
ఇంకెక్కడికి పరుగు తీస్తావ్
అదుపుతప్పిన ఖడ్గమృగం
నీ అడుగుల గుర్తు పట్టింది
అప్పుడే రేపటి నీ శవానికి
పరిహారం ప్రకటించేశారు
ఇదిగో... ఇటురా
నా మిత్రుడి శవం ముట్టా
తెగిపడిన మౌనాన్ని పోగు చేద్దాం
ఉడుకు నెత్తుటి ఉప్పెనతో కప్పెడదాం
నువ్వయినా మోసపోకు మిత్రమా!

— రామశేషు

హైద్రాబాద్‌లో శాస్త్రి వాళ్ళు సెటిల్ అయ్యారు. నేను విజయవాడలో సెటిల్ అయ్యా. హైద్రాబాద్ వెళ్ళినప్పుడల్లా వాళ్ళింట్లో ఒక ''మినీ ఇండియా''లా వుంటుంది నాకు. అప్పుడప్పుడూ అంటూ వుంటా, ''మీ అబ్బాయికి క్రిష్టియన్ అమ్మాయి నిచ్చి చేయరా'' అని. సయిూదా నవ్వుతూ ''ఆ పుణ్యం నువ్వే కట్టుకో అన్నయ్యా'' అంటూ వుంటుంది.

* * *

నాంపల్లి స్టేషనులో దిగుతూనే, కర్ఫ్యూ పాస్ తీసుకుని, పోలీసులు అరేంజి చేసిన బస్సులో శాస్త్రి వాళ్ళింటికి వెళ్ళా.

శాస్త్రి, సయిూదా హృదయ విదారకంగా ఏడుస్తున్నారు.

''చూశావా అన్నయ్యా, మన సలీంని కత్తితో ఎన్ని పోట్లు పొడిచి చంపారో...వాడేం పాపం చేశాడు? పాల ప్యాకెట్టు కోసం నిలబడ్డాడు. ఎవరో వచ్చి అకారణంగా పొడిచేశారు. ఒక్కగా నొక్క బిడ్డ పోయాడు...'' సయిూదాని ఆపలేక పోయా.

నిజమే. ఏం పాపం చేశాడు సలీం? ఎందుకు పొడిచారు? ఎవరు పొడిచారు? హిందువులా.. ముస్లింలా...ఎవరు?

అసలు 'సలీం' ఎవరు? హిందువా? ముస్లిమా?

అవును, పేరును బట్టి 'ముస్లిం'

మరి తండ్రి శాస్త్రి గదా! ఐతే, బ్రాహ్మణుడు, 'హిందూ'.

హిందూ, ముస్లిముల కతీతమైనది 'సలీం' మతం. మరి ఎవరు పొడిచారు?

సంకుచిత భావాలతో, క్రూరంగా, అమానుషంగా చేసిన పని యిది.

నేను కలలుగన్న 'మినీ ఇండియా' ఏమైంది? ఇప్పుడు శాస్త్రికి హిందువులు సానుభూతి చూపుతారా?

సయిూదాపై ముస్లిములు సానుభూతి చూపుతారా? సలీంకి శవ సంస్కారం హిందువులు చేస్తారా, ముస్లిములు చేస్తారా?

''మతాతీత రాజ్యాంగం'' ఏం సమాధానం యిస్తుంది?

సెక్యులర్ ఫోర్సుల పేరిట వోట్లు దండుకుంటున్న రాజకీయ పార్టీలు ఏం సమాధానమిస్తాయి?

లౌకిక రాజ్యానికై పాటుపడ్తున్నామంటున్న 'బడా' నాయకులు ఏం సమాధాన మిస్తారు?

ఇవి జవాబులేని ప్రశ్నలు
జవాబు లేని ప్రశ్నలు.